# అమరావతి కథలు

సత్యం శంకరమంచి



అది రుద్రభూమి!

పుట్టిన ప్రతివాడూ ఆఖరికి చేరుకునే పుణ్యభూమి. జీవితమనే అవిశ్రాంత యానంలో ఆఖరి ద్వారం అది. ఆ ద్వారం దగ్గర నుంచుని ఉన్నాడు కాటికాపరి ఏసోబు.

చీకటంత నల్లగా ఉన్నాడు యేసోబు. కాగడాల్లా ఎర్రటి కళ్ళు. గుబురు మీసం, భేతాళుడి చేతులు. సుబ్బయ్యగారు బుగ్గయిపోతుంటే కొడుకులు మనవలూ గోలుగోలున ఏడుస్తున్నారు. గుండెలవిసిపోయేట్టు రాళ్ళు కరిగిపోయేట్టు 'అనాథులమై పోయినాం! ఎవరు దిక్కు మాకు' అని ఆకాశానికంటేటట్లు విలపిస్తున్నారు. ఆ ఏడుపులు, ఆ వేదన ఆ బాధ ఏవీ ఏసోబుకంటలేదు. అతని ముఖంలో ఏ విచారమూ లేదు. అవన్నీ తనకు పట్టనట్టు తన ధర్మం తను చేసుకుపోతున్నాడు.

ఇప్పటి మాట! తనకి పదేళ్ళవయస్సు వచ్చినప్పటి నించి తండ్రి ప్రక్కనే వుండేవాడు. నిత్యమూ చావులూ, ఏడుపులూ తప్ప వేరేమీ ఎగరడు. అంచేత జీవితంలోని దుఃఖాలన్నింటికంటె పెద్ద దుఃఖమైన మృత్యువు అతన్నేం కదిలించదు. సజ్జనులు పోయినప్పుడు లోలోపల "అయ్యో!" అనుకునేవాడు. దుర్జనులు పోయినప్పుడు "ఇప్పటికి పాపం పండిందే" అనుకునేవాడు. తను దొంగ ఏడ్పులు చూశాడు. కుంకుమ చెరిగి పోతుంటే, గాజులు చిట్లిపోతుంటే, గుండె ముక్కలవుతుంటే "కాల సహజం" అనుకునేవాడు తప్ప - కంట నీరెట్టి ఎరగడు.

తండ్రిని మట్టి చేస్తుంటే అతనికేం అన్పించలేదు. అంతదాకా ఎందుకు? కట్టుకున్న ఇల్లాల్ని మోసుకొచ్చినప్పుడు కూడా కదిలిపోలేదు. జనమంతా "బండ ముండాకొడుకు" "రాతిగుండె" "రాక్షసుడు" అన్నారు.

బతికున్నప్పుడు మిగతా జనం అడుగు పెట్టడానికే భయపడే చోట, ఆ పేరు తలుచుకుంటేనే హడిలిపోయేచోట, ఏసోబు నిత్యనివాసంగా ప్రతిక్షణం మృత్యు వాతావరణంలో నిర్మోహంతో, నిరాసక్తతతో జీవిస్తున్నాడు. జనమంతా వెళ్ళిపోతున్నారు.

"అయ్యోవ్!" పన్నెండేళ్ళ పిల్లాడు కృష్ణ వొడ్డునించి కేక. అతగాడు ఏసోబు

## ఏడు పెరగనివాడు

కొడుకు బుల్లిగాడు. వాడికి ఈ పక్కలకి రావటానికి భయం.

"ఆ! వచ్చె!" యేసోబు తిరిగి కేక.

ఏసోబు గుడిసె కృష్ణ వొడ్డునే. కొడుకు గంజి కాచి తండ్రిని పిలిచాడు. ఇద్దరూ కృష్ణవొడ్డున కూర్చుని ముంతల్లో గంజి వొంపుకు తాగుతున్నారు. బుల్లిగాడు తాగలేకపోతున్నాడు "ఏటయిందిరా?" అని తండ్రి కొడుకుని దగ్గరకు తీసుకుంటే బుల్లిగాడి వొళ్ళు కాలిపోతోంది.

"ఓరి జోరం వచ్చిందిరా...." అంటూ ఏసోబు మిగిలిన గంజి వొదిలేసి కొడుకునెత్తుకుని గుడిసెలోకి తీసికెళ్ళి పడుకోబెట్టి కంబళికప్పి "మందు తెస్తానుండు" అంటూ వూళ్ళోకొచ్చాడు.

ఏసోబు వీధిలో నడుస్తుంటే జనమంతా పక్కకు తప్పుకు వెళ్ళిపోతున్నారు. ఆచార్లగారి దగ్గరకెళ్ళి మందు తీసుకొని చిల్లరకొట్టు దగ్గరకొచ్చి ఉప్పు, చింతపండు తీసుకున్నాడు ఏసోబు. షావుకారు పొట్లాలు దూరంగా విసిరేసి డబ్బులమీద నీళ్ళు చల్లి గల్లాపెట్టెలో వేసుకొన్నాడు. వీధిలో నడుస్తూ ఏసోబు అనుకున్నాడు. 'వాళ్ళంతా మనుషులు. నేనుకాను. నన్ను చూసినా తాకినా సెరుపే! కాని అయ్యలూ అందరూ నా చేతిమీంచి పోవల్సినోళ్ళే....'

గుడిసికొచ్చి కొడుక్కి మందిచ్చి, ఓ గంట వొళ్ళు వాల్చాడో లేదో గట్టు మీంచి పిలుపు. మృత్యువుకి పగలూ రాత్రి లెక్కేటి! తనకూ వేళాపాళా లేదు! లేచి వెళ్ళాడు ఏసోబు.

తిరిగివచ్చేప్పటికి బాగా పొద్దుపోయింది. ఆ రోజు చీకటి మరీ చిక్కగా వుంది. కొడుకు వొళ్ళు మసిలిపోతోంది. మళ్ళీ మందిచ్చాడు. బుల్లిగాడి తల వొళ్ళో పెట్టుకు కూర్చున్నాడు. వాకి వొంటిమీద స్పృహ లేదు. ఉన్నట్టుండి బుల్లిగాడి వొళ్ళు చల్లబడుతోంది. మరీ చల్లబడుతోంది. ఏసోబు అరికాళ్లు రుద్దాడు. అరిచేతులు రుద్దాడు. వాణ్ణి ఎట్లాగైనా బతికించుకోవాలి. లాభం లేదు. చిన్నవాడి వొళ్ళు సాంతం చల్లబడిపోయింది. ఏసోబు బుల్లిగాణ్ణి గుండెలకి హత్తుకున్నాడు. భళ్ళు భళ్ళున ఏడ్చాడు. జీవితంలో మొట్టమొదటిసారి ఏడ్చాడు. నరాలు తెగిపోయేట్టు ఏడ్చాడు. కృష్ణ కదిలిపోయేటట్లు, నేల పగిలిపోయేటట్టు, ఆకాశం చిరిగిపోయేటట్టు ఏడ్చాడు.

ఏడ్చి ఏడ్చి ఆగి ఒక్కసారి కృష్ణవైపు చూశాడు. ఎప్పటిలాగా ముందుకెళ్తోంది.

అవునూ! తను ఎందుకు ఏడ్చినట్టు?

మామూలయిపోయాడు "వెళ్ళిన వాళ్ళు వెళ్తారు ఉన్నవాళ్ళు ఉంటారు" అనుకుని ఏమీ జరగనట్టు కొడుకుని బుజానికేసుకొని మట్టి చేయడానికి గట్టు మీదికొచ్చాడు. కొడుకు మీద మట్టికప్పి ఎదురుగా నుంచుని అన్నాడు : "ఓ తల్లీ! నేల తల్లీ నువ్వెంత గొప్పదానివమ్మా? ఏడు పెరగని వాణ్ణి ఈ బుడ్డాడి కోసం ఏడుస్తా నేమోనని అణ్ణి ముందే తీసుకెళ్ళావా అమ్మా! లేపోతే ఓరి బుడ్డాడా! నీ అయ్యపోతే నువ్వేడుస్తావేమోరా! బతుకంతా ఏడు పెరక్కుండా బతికిన ఏసోబుగాడు పోయాకకూడా ఎవరూ ఏడవ కూడదని అణ్ణిప్పుడే లాక్కెళ్ళావా తల్లీ! కానమ్మా! నాకేం దిగుల్లేదు! కానీ తల్లీ! నే పోయాక మట్టి చేసేందుకు మడిసి లేకుండా పోయాడు- కొంచెం....... కొంచెం ముందు చెప్తివా.... నేనే గొయ్యి తీసుకు అందులో పడుంటాను. ఆ పైన నువ్వే మట్టి కప్పుకో తల్లీ" అంటూ ఆకాశంవైపు చూసి పిచ్చిగా నవ్వాడు. ★